www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 26 డిసెంబర్ 2022

5

కాకినాడ



బియ్యం కార్డుల రద్దు వార్తలు అవాస్తవం : జెసి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా 24,500 రేషన్ కార్డులను రద్దు జాబితాలో చేర్చినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో బియ్యం కార్డుల రద్దుకు రహస్య సర్వే నిర్వహించారనే వార్తల్లోనూ నిజం లేదన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పారదర్శకంగా, జవాబుదారీతనంతో పథకాలు, కార్యక్రమాలు అమలకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 2022కు సంబంధించి 2వ విడతలో 2,110 కొత్త బియ్యం కార్డులను మంజూరు చేశామన్నారు. వీరికి 2023 జనవరి నుంచి సరుకులు అందిస్తామన్నారు. అర్హత ఉన్న వారికి కొత్త కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు.

ఆరోగ్య సిబ్బంది ఆకలికేకలు

10 నెలలుగా అందని వేతనాలు
కనికరించని అధికారులు
అప్పులు చేసి కుటుంబాల పోషణ

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్యసేవలు అందిస్తున్న సిబ్బంది అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. 10 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి నేటి వరకు చిల్లు గవ్వ కూడా చేతికి అందని పరిస్థితుల్లో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2020 జూన్‌లో ఎపి కార్పొరేషన్ ఆఫ్ ఔట్ సోర్సడ్ సర్వీసెస్ (ఆప్కాస్) సంస్థను ఏర్పాటు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ అందులో చేర్చింది. దీనిలో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉమ్మడి జిల్లాలో వివిధ పిహెచ్‌సిల్లో ఎంఎన్‌ఒ, ఎఫ్ఎన్‌ఒ, శానిటరీ అటెండర్ కం వాచ్మెన్ (ఎస్ఎడబ్ల్యు) పేరుతో 135 మందిని నియమించారు. మూడు జిల్లాల్లో వీరంతా ఆరోగ్య సేవల్లో పాల్గొంటున్నారు. ఒక్కొక్కరికీ రూ.15 వేలు వేతనంగా ఇస్తామని చెప్పారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు లేకపోయినప్పటికీ, తక్కువ వేతనమే అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో పలువురు నిరుద్యోగులు ఆరోగ్య సేవల్లో పాల్గొంటున్నారు.

వేతనాల కోసం వేడుకోలు

ఆప్కాస్ సంస్థలో చేరిన వీళ్లంతా వివిధ ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. రేషన్ కార్డులు సైతం రద్దయ్యాయి.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఆరోగ్య సిబ్బంది(ఫైల్)

అయినా కుటుంబాలను పోషించుకునే క్రమంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే పది నెలలుగా ఒక్క రూపాయి కూడా వేతనం అందుకోలేదు. దీంతో సిబ్బంది అందరికీ రూ.2 కోట్ల 2లక్షల 50 వేల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతివారం కాకినాడ కలెక్టరేట్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ఇప్పటి వరకూ 5 సార్లు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారుల సైతం పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. అప్పులు చేసి కొంతమంది జీవనం సాగిస్తుండగా, మరికొందరికి అప్పుల పుట్టని పరిస్థితుల్లో ఇంట్లో వస్తువులు అమ్ముకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.



నిరంతరం సేవలు

ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా మేమంతా నిరంతరం సేవలు అందిస్తున్నాం. అయినా ప్రభుత్వం తమపే చిన్న చూపు చూస్తోంది. పది నెలలుగా వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోంది. ఇప్పటికైనా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని వెంటనే విడుదల చేయాలి.

-కాకర్ల రేఖామణి, ఎఫ్ఎన్ఒ, కరప పిహెచ్‌సి



అధికారులకు విన్నవించినా ఫలితం లేదు

నాకు ఇప్పటి వరకు రూ.1.50 లక్షల వేతనం పెండింగ్‌లో ఉంది. ఇలా అందరికీ ఇవ్వాలి. సొంత ఖర్చులు పెట్టుకుని పిహెచ్‌సిల్లో పని చేసేందుకు వెళుతున్నాం. పెండింగ్ వేతనాల కోసం అధికారుల చుట్టూ అనేకసార్లు తిరుగుతున్నాం. అయినా పట్టించుకోవడం లేదు. అదిగో ఇదిగో అంటూ సాంకేతిక కారణాలు చూపిస్తూ దాటవేస్తున్నారు.

-కేసనకుర్తి అఖిల, ఉప్పలగుప్తం

మనుస్మృతి ప్రతుల దహనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మనుస్మృ ప్రతుల దహన దినోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వ జన కళామండలి జిల్లా అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ 1927 డిసెంబర్ 25న మను ధర్మ శాస్త్రం మానవ హక్కుల వ్యతిరేకంగా ఉందని, స్త్రీలను బానిసలుగా చూస్తుందని మనుధర్మ శాస్త్ర ప్రతులను అంబేద్కర్ తగులబెట్టారన్నారు. ఈరోజును మానవ హక్కుల పరిరక్షణ దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జక్కల ప్రసాద్‌బాబు, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, విప్పర్తి శ్రీనివాస్, బాబూరావు, వాకపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



జబర్దస్త్ టీమ్ సందడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని మట్లపాలెం వద్ద మహాలక్ష్మి కౌంటిలో జబర్దస్త్ టీమ్ ఆదివారం సందడి చేసింది. సంకీర్తన ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో మహాలక్ష్మి కౌంటీ నూతనంగా నిర్మించిన డిటిసిపి లేఔట్‌లో జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్, శాంతి స్వరూప్, నరేష్ బృందం ఆహుతులను స్కిట్లతో ఉత్సాహపరిచింది. జోకులు వేస్తూ సందడి చేశారు. దీంతో అక్కడ పండుక వాతావరణం నెలకొంది. పలువురు జబర్ధస్త్ కళాకారుళతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి కౌంటీ అధినేత చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, పెద్ద సంఖ్యలో కస్టమర్లు పాల్గొన్నారు.

12 వేల కేకుల పంపిణీ

ప్రజాశక్తి-కరప

మండలంలోని చర్చిల్లోని 12 వేల ప్లమ్ కేకులను జనసేన నాయకులు పంతం నానాజీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆదివారం క్రిస్మస్ సందర్భంగా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు సైనవరపు భవానిశంకర్, ఎ.రాంబాబు, సుందర సత్తిబాబు, యర్రంశెట్టి దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుల సమక్షంలో సుమారుగా 102 ప్రార్థన మందిరాల్లో వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరకూ సుఖసంతోషాలతో గడపాలని నాయకులు ఈ సందర్భంగా అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని అన్నిగ్రామాల, డివిజన్ల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదజల్లుకు రైతుల మొగ్గు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సమయం ఆదా, పెట్టుబడి ఖర్చుల తగ్గింపు నేపథ్యంలో దాళ్వా (రబీ) పంట సాగును దాదాపుగా 85 శాతం మంది రైతులు వెదజల్లే పద్ధతిని పాటిస్తున్నారు. సామర్లకోట మండల పరిధిలో సుమారు 24వేల ఎకరాల్లో రబీకి వరిని సాగు చేయనున్నారు. గొదావరి కాల్వ, ఏలేరు జలాలు అందుబాటులో ఉండడంతో రైతులు తమ పంట పొలాలను వెదజల్లే పద్ధతిలో సాగు చేయుటకు అనుగుణంగా దమ్ము చేసి పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. దాదాపు 90 శాతం మంది రైతులు నారు మడులు వేయకుండా నేరుగా పంట పొలంలో విత్తనాలు వెదజల్లే పద్ధతి పాటిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పెదబ్రహ్మదేవం, వేట్లపాలెం, జిమేడపాడు, జికొత్తూరు, హుస్సేన్‌పురం, ఉండూరు, అచ్చంపేట, పవర, నవర తదితరగ్రామాల్లో వెదజల్లే పద్ధతిలో సాగు పనులు రైతులు ప్రారంభించారు. 10 శాతం మంది రైతులు నారు మడులు పెంచి నేరుగా పొలంలో నాట్లు వేసే పద్ధతిని పాటించనున్నారు. కూలీల కొరత, అధిక ధరలు, సమయం అధికంగా పట్టడంతో నారు మడులు వేసి సాగు చెయ్యడం కన్నా నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతి బావుందని రైతులు చెబుతున్నారు. పైగా నారు మడికి నేరుగా వెదజల్లే పద్ధతికి ఎకరాలకు 10 కిలోలు విత్తనాలు తక్కువ ఖర్చు అవుతున్నాయన్నారు. రైతులు బొండాలు రకం ప్రభాత్ ఎంటియు-3626 రకం విత్తనాలను సాగు చేస్తున్నారు. అధిక శాతం మంది రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలపైనే ఆధార పడుతున్నారు. ఆర్‌బికెల ద్వారా బొండాల రకం విత్తనాలకు స్టాకు ఇండెంట్‌లు పెట్టినా, నేటికి స్టాకు రాలేదు. దాంతో పెద్ద రైతుల నుంచి మిగిలిన రైతులు విత్తనాల ధాన్యం కొనుగోలు చేసి సాగుకు సిద్ధం అవుతున్నారు. ఎరువుల విషయానికి వస్తే యూరియా, డిఎపి నిల్వలు ఆర్‌బికేలకు చేరుకున్నప్పటికి, యాప్‌లో ఇంకా ఒపేన్ అవ్వనందున విక్రయాలు ఇంకా ప్రారంభించలేనట్లు సమాచారం. ఒకవైపు నారు మడులు వెయ్యడం, నారు పెరిగే



దుక్కులతో సాగుకు సిద్ధమైన పంట చేలు

వరకూ వేచి ఉండడం, కూలీలతో నారు కట్టలు కట్టించడం, మడుల్లోకి మోసుకెళ్ళడం, కూలీలతో నాట్లు వేయించడం వల్ల చాలా డబ్బు ఖర్చు అవ్వడంతోపాటు సమయం కూడా పడుతుందని, వెద జల్లే పద్ధతిలో సమయం ఆదా అవ్వడంతోపాటు, కూలీల ఖర్చులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. కలుపు మొక్కలు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని రైతులకు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



శిథిలమైన రెయిలింగ్

పర్యవేక్షణ లేక వంతెన శిథిలం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

కాకినాడ పోర్టుకు అనుసంధానంగా సామర్లకోట-కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ రాయి సమీపంలో సుమారు 30 ఏళ్ల క్రితం కాకినాడ రైల్వే లైన్‌పై నిర్మించిన ఎడిబి రోడ్డు వంతెన నిర్వహణను అర్అండ్‌బి అధికారులు దాదాపుగా గాలికి వదిలేశారు. ఫలితంగా వంతెన ఇరువైపులా రెయిలింగ్‌లు శిథిలమయ్యాయి. వంతెన ఫుట్‌పాట్‌పై ఇరువైపుల నడవడానికి వీలులేకుండా దుర్భరంగా మారింది. మరోవైపు వంతెను ఇరువైపులా పలు చోట్ల రావి, మర్రి తదితర మొక్కలు పెరిగి పోయాయి. రాజానగరం నుంచి కాకినాడ పోర్టు వరకూ 1990లో సుమారు 45 కిలో మీటర్ల మేర ఎడిబి నిధులతో సామర్లకోట ముత్యాలమ్మ రాయి రైల్వే లైన్‌పై నుంచి ఈ వంతెనను నిర్మించారు. కాకినాడ పోర్టుకు ఈ వంతెనపై నిత్యం వేలాది వాహనాలు, బారీ లోడు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎడిబి రోడ్డుకు భారీగా గొతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా వున్నప్పుడల్లా కేవలం గోతులను పూడ్చి అధికారులు తాత్కాలికంగా చేతులు దులుపు కొంటున్నారు. ఈ వంతెనకు సమీపంలోని అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప నివాసం ఉంటూ పార్టీ కార్యక్రమాలు సాగిస్తున్నారు. శిథిలమైన రెయిలింగ్‌ను బాగుచేయించి, పిచ్చి మొక్కలు తొలగించి, వంతెన పై రాకపోలకు వీలుగా లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు, సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వంతెనపై మొలిచిన మొక్కలు

30 ఏళ్ల సమస్యకు పరిష్కారం

వంతెన నిర్మాణానికి ఎంఎల్ఎ జ్యోతుల శంకస్థాపన

ప్రజాశక్తి - గండేపల్లి

సుమారు 30 సంవత్సరాల నుంచి ఉన్న వంతెన సమస్యకు పరిష్కారం లభించనుంది. నిలాద్రిరావుపేట శివారున వంతెన నిర్మాణానికి ఎంఎల్ఎ జ్యోతలు చంటిబాబు హామీ ఇచ్చారు. దీనిపై పలువురు నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామ శివారున బ్రిడ్జి నిర్మాణానికి ఎంఎల్ఎ జ్యోతుల శంకుస్థాపన చేశారు. ఫిబ్రవరి నెల లోగా నిర్మాణ పనులు పూర్తి చేస్తారని ఆయన హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లగా ఊరు మధ్యలో నుంచి పుష్కరకాలువ శివారునున్న ప్రాంతవాసులకు సరైన రహదారి లేదు. దీంతో వారు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్న స్పందించిన దాఖలాలు లేవు. ప్రజల సమస్యను గుర్తించి ఎంఎల్ఎ ముందుకు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్‌ఎ చంటిబాబు మాట్లాడుతూ ఇలాంటి సమస్యలు తన దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను రూ.60లక్షలతో చేపట్టనున్నామన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను



వంతెన పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ఎంఎల్ఎ జ్యోతుల

ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సిహెచ్.దొరబాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, వైసిపి మండల అధ్యక్షులు కందుల చిట్టిబాబు, జెడ్ రాగంపేట సొసైటీ అధ్యక్షులు బొడ్డు సత్తిరాజు, సర్పంచ్ మల్లంపాక సురేష్‌బాబు, నాయకులు అడబాల ఆంజనేయులు, జాస్తి వసంత్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడ నుంచి వారణాసికి రైలు కోసం వినతి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నుంచి వారణాసికి రైలు వేయాలని ఎంపీ వంగా గీతా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్‌కు వినతిపత్రం అందించారు. ఆదివారం ఢిల్లీలో మంత్రిని ఎంపీ కలిశారు. జిల్లాలో రైల్వే సమస్యలను వివరించారు. ముఖ్యంగా కాకినాడ నుంచి వారణాసికి వెళ్లేందుకు వీలుగా కాకినాడ నుంచి నూతన రైలును ప్రవేశ పెట్టాలన్నారు. తుని, పిఠాపురం, సామర్లకోట, అన్నవరంలలో



ప్రయాణికులు, వ్యాపారులు, భక్తులూ కోసం ముఖ్యమైన రైళ్లు నిలుపుదల చేస్తూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రయాణికుల రద్దీ, వారి అవసరాలు గమనించి భోగీల సంఖ్య పెంచాలని మంత్రిని కోరారు. అదేవిధంగా కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ కలపాలని, కాకినాడను మెయిన్ లైన్ విషయం 3వ లైన్ వేసే సమయంలో పరిశీలించాలని ఎంపీ మంత్రిని కోరారు.

ఘనంగా సత్తెమ్మ గరగల ఉత్సవం

ప్రజాశక్తి- పెద్దాపురం

ప్రతి ఏడాది సంక్రాంతి, కనుమ రోజున ఘనంగా జరిగే పెద్దాపురం పాండవుల మెట్ట సత్తెమ్మ అమ్మవారి జాతర ఉత్సవంలో భాగంగా ఆదివారం గరగల ఉత్సవం ఘనంగా నిర్వహించారు.ఆలయ పూజారి పప్పల పెద్ద ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గరగల కళాకారుల నత్యాలు,డప్పుల కళాకారుల దరువుల విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తమ్మన కృష్ణప్రసాద్, ఏడిద మాణిక్యాలరావు, పప్పల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల రవిబాబుకు సన్మానం

ప్రజాశక్తి- రౌతులపూడి

సీమాంధ్ర బిసి సంక్షే సంఘం ప్రతిపాడు నియోజకవర్గ గౌరవాధ్యక్షులుగా నియమితులైన కోళ్ల రవిబాబును సంక్షేమం ప్రతిపాడు నియోజకవర్గ అధ్యక్షులు గొంప శివకుమార్, తొండంగి మాజీ ఎంపిపి కొయ్య శ్రీవిద్య, నాయకులు శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు రాజకీయంగా. సామాజికంగా బలహీన వర్గాలకు చెందిన వారిని ప్రోత్సహించడమే తమ ధ్యేయమని నేతలు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడి నూకరాజు, సూర్ల సత్తిబాబు తదితరులు ఉన్నారు


ఉత్సాహంగా నృత్య పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



కాకినాడ సూర్య కళామందిరంలో శివ పదం రాష్ట్ర స్థాయి నృత్యపోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. రెండు రోజుల పాటు జరిగే నత్య పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ సంగీత విద్వాంసులు పెద్దాడ సూర్యకుమారి హాజరయ్యారు. ప్రముఖ నాట్యకారుడు కృష్ణమాచారి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ముందుగా సరస్వతిదేవి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ నత్యాలతో అలరింపజేశారు.


కార్టూ'నిజం'



ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి పంచారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. **పెద్దాపురం** దర్గా సెంటర్లోని యేసు కపాలయం వారి ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ యండమూరి విజయలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్ విడదాసరి రాజా, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, పాస్టర్ భాస్కరరావు, వైసిపి నాయకులు చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్** జగన్నాధపురంలో చర్చ్ స్క్వేర్ సెంటర్లో బ్రిటిష్ కాలం నాటి సెయింట్ ఆన్స్, ఆర్‌సిఎం, రోమన్ క్యాథలిక్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వీటితో పాటుగా సెయింట్ థామస్ బాప్టిస్ట్ చర్చిల్లో, గాంధీనగర్, రామారావు పేట, బాలాజీ చెరువు కోడళ్ళలో ఉన్న పెంతుకోస్తు, లూథరన్, హౌస్ ఆఫ్ ప్రేయర్ తదితర ప్రార్థనయాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో ఏసుక్రీస్తు జనవత్తాంతం తెలిపే బొమ్మల కొలువులు ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. **తాళ్లరేవు** పునరుద్దాన బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో జడ్‌పిటిసి సభ్యులు, రెవరెండ్ దొమ్మేటి సామ్యూల్ సాగర్ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు శాంతి స్వరూపుడని, ఆయన



తాళ్లరేవులో పాల్గొన్న ఎంఎల్ఎ పొన్నాడ



పెద్దాపురంలో...



కాకినాడలో...

దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. చర్చి వ్యవస్థాపకులు దొమ్మేటి వసంతరావు, ఎంపిపి రాయుడు సునీత, వైసిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, నాయకులు కుడుపూడి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. తాళ్లరేవు బెతెస్త మందిరంలో చిన్నారులు ఏసు సంకీర్తనలు పాడి అలరించారు. **రౌతులపూడి** మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి సందడి చేశారు. రాఘవపట్నంలో పాస్టర్ జ్యోతి బాబు సమకూర్చిన దుస్తులను సర్పంచ్ రాయిపల్లి లోవరాజు పేదలకు అందించారు. **ఏలేశ్వరం** యావత్ మానవాళికి ఏసుప్రభు బోదనలు మార్గదర్శకాలని టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల రాజా అన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్ద శంకర్ల పూడి గ్రామంలోని టిడిపి కార్యాలయంలో ఆయన ఆదివారం క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జ్యోతుల పెదబాబు, సూతి బూరయ్య, బసా ప్రసాద్, చెందువోలు రాజా, నూకతాటి ఈశ్వరుడు, ఏలేశ్వరం మండల టిడిపి కార్యకర్తలు ఉన్నారు.



గోడౌన్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి

గొడౌన్‌ను ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - బిక్కవోలు

కొంకుదురులో రూ.24 లక్షలతో నిర్మించిన కొంకుదురు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన గొడౌన్‌ను అనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వరుపుల సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతులు ఎక్కువగా ఉన్న ప్రాంతం కాబట్టి ఈ గోడౌన్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ సత్తి నాగిరెడ్డి(రాజా), జడ్‌పిటిసి సభ్యులు రొంగల పద్మావతి, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపిటిసి సభ్యులు పివి, పందలపాక పిఎసిఎస్ ప్రెసిడెంట్ ప్రసాద్ రెడ్డి, మహేంద్రవాడ సొసైటీ అధ్యక్షుడు తాడి వీరవెంకటసత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు

వంతెనకు ఎంఎల్‌ఎ జ్యోతుల శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలం కష్ణునిపాలెం పంచాయతీ సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, జోగేశ్వరావు దంపతుల ఆధ్వర్యంలో ముసిరిమిల్లి కాలుపై వంతెన నిర్మాణానికి జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.39 లక్షలతో దీన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చంటిబాబు మాట్లాడుతూ కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని కృష్ణుని పాలెం, రామన్నపాలెం, కొత్తూరు, వెంకటాపురం తదితర గ్రామాల్లో రైతులు వంతెన లేక నానా ఇబ్బందులు పడేవారన్నారు. సర్పంచ్ ఆదిలక్ష్మి ఈ సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. అధికారులతో మాట్లాడి సిఎస్ఆర్ నిధులు రూ.39 లక్షలు మంజూరు చేసి నిర్మాణపనులకు శంకుస్థాపన చేశామన్నారు. పనులు వెంటనే మొదలు పెట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వంతెన నిర్మాణం పూర్తి అయ్యేవరకు నీటి ఇబ్బందులు లేకుండా కాలువను పక్కకు మళ్లించి నీటిని వదలాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగరమేష్, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు మార్కెట్ యార్డ్ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జోషితకు నేతల ఆశీర్వచనాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల కు చెందిన టిడిపి నాయకులు సఖుమల్ల ఆది పట్టాభి రామన్న(రాముడు) మనుమరాలు సఖుమల్ల ప్రకాశరావు, మణి దంపతుల జ్యేష్ఠ కుమార్తె జోషిత పుష్పాలంకరణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆదివారం ముఖ్య అతిథిగా విచ్చేసి జోషితకు ఆశీర్వచనాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాల స్వామి, నేతలు ఆకుల రామకష్ణ, నైనాల శ్రీరామచంద్రమూర్తి, బల్ల హరి, రామానుజుల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



దుళ్లలోనూతనంగా నిర్మించిన పశువైద్యశాల భవనం

నిరుపయోగంగా పశువైద్య శాల

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామంలో చెరువుగట్టుపై గల గ్రామీణ పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి, అదేచోట నాబార్డు నిధులు సుమారు రూ.27.5 లక్షలతో నూతన పశు వైద్యశాల భవన నిర్మాణ పనులు 2018లో మొదలుపెట్టారు. అనతి కాలంలోనే అధిక శాతం భవన నిర్మాణం పూర్తయ్యింది. భవనం రక్షణలో భాగంగా గుమ్మాలకు, కిటికీలకు తలుపులు ఏర్పాటు చేసి, ఫ్లోరింగ్ తదితర కనీస వసతులు సమకూర్చాల్సి ఉంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూడేళ్లగా పశువైద్యశాల నిరుపయోగంగా ఉందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. 2018 లోనే పశు వైద్యశాలకు తాత్కాలికంగా గ్రామంలో బైపాస్ రోడ్ నందు గల పాత పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేటాయించారు. అనంతర పరిణామాల్లో ఈ భవనంలోనే నూతనంగా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇదే భవనంలో రైతు భరోసా కేంద్రం కూడా ప్రారంభించారు. అధిక శాతం పనులు పూర్తయ్యిన పశువైద్యశాల నూతన భవనం అక్కడ ఖాళీగా దర్శన మిస్తుండగా, మూడు కార్యాలయాల సిబ్బంది కార్యకలాపాలతో ఇక్కడ పాత పంచాయతీ కార్యాలయ భవనం కిక్కిరిసి కనిపిస్తోంది. దీనితో వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు, ఆర్‌బికెకు వచ్చే రైతులు, పశువులను వైద్యశాలకు తీసుకురావాల్సిన పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు కనీసం స్పందించలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యల పరిస్కారానికి కషిచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

దీనిపై వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ(కడియం)ను వివరణకోరగా పశువైద్యశాల నూతన భవన నిర్మాణ గుత్తేదారునికి బిల్లులు చెల్లింపులు జరగలేదని తెలిసిందన్నారు. ఈ భవనం విషయాన్ని మూడేళ్లగా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని బదులిచ్చారు.

తీవ్ర ఇబ్బందులుపడుతున్నాం

సచివాలయంలో పశువైద్యశాల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వైద్యం నిమిత్తం పశువులను తీసుకు వచ్చినప్పుడు ఖాళీ లేక అవస్థలు పడుతున్నాం. తక్షణం నూతన పశువైద్యశాల భవనంను వినియోగంలోకి తేవాలి.

-ముళ్లపూడి సత్యనారాయణ, దుళ్ల పశుపోషకులు

చేనేత రంగం అభివృద్ధికి కృషి

చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు పెద్దిరాజు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత జౌళి శాఖ ద్వారా పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని ఆ శాఖ జిల్లా సహాయ సంచాలకులు కురెళ్ల పెద్దిరాజు తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి కషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్మికుల అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రజాశక్తికి వివరించారు.

జిల్లాలో చేనేత సహకార సంఘాలేన్ని, వాటి ఉత్పత్తి ఎంత.?

జిల్లాలో 18 చేనేత సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో 4,500 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 1,500, సహకారేతర రంగంలో 3వేల వరకూ మగ్గాలున్నాయి. చేనేత సహకార సంఘాల ఉత్పత్తి విలువ రూ.1.6కోట్లు ఉంది. వీటి అమ్మకాల విలువ రూ.1.22కోట్లుగా ఉంది.

ఆప్కో బకాయిలు ఎంత ఉన్నాయి.?

జిల్లాలో ఉన్న 18 చేనేత సహకార సంఘాలకు సుమారు రూ.70 లక్షల బకాయిలు ఉన్నాయి. ఇందులో అధికంగా పెద్దాపురం గల చేనేత సంఘానికి రూ.35 లక్షల బకాయి ఉంది.ప్రభుత్వం త్వరలోనే వీటిని విడుదల చేయనుంది.

పాలక వర్గాలు ఎలా పనిచేస్తున్నాయి.?

జిల్లాలో అన్ని సొసైటీల పరిధిలో 2018 ఫిబ్రవరితో పాలక వర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి తాత్కాలిక పాలక వర్గాలు నడుస్తున్నాయి. త్వరలో మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం.

వైఎస్ఆర్ నేతన్న నేస్తం ఎలా అమలవుతోంది.?

వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తుంది. దీనిలో భాగంగా మగ్గం కలిగి, నేత మీద జీవిస్తున్న కార్మికుల కుటుంబానికి ఒక్కొక్కరికి నెలకు రూ.2 వేలు చొప్పున సంవత్సరానికి రూ.24 వేలు అందజేస్తున్నాం. గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా సర్వే జరుగుతుంది. 2022-23లో 2,676 మందికి రూ.6కోట్ల 47లక్షల 24 వేలు ఈ ఏడాది ఆగస్టులో పంపిణీ చేశాం.

త్రిఫ్ట్ ఫండ్ పథకం కోసం వివరిస్తారా...

సొసైటీలో నమోదై నేత నేసిన ప్రతి కార్మికుడు మజూరీలో 8 శాతం పొదుపు చేస్తే మరో 16 శాతం జోడించి మొత్తం 24 శాతం ప్రభుత్వం ఈ పథకం ద్వారా కార్మికులకు అందిస్తుంది. అలాగే సంఘాలకు 40 శాతం సబ్సిడీను కూడా ఇస్తుంది. సంఘాల ద్వారా దుస్తులు అమ్మకాలు జరిపితే 30 శాతం రిబేటు కూడా ఉంటుంది.

చేనేత పరికరాల పంపిణీ ఎలా ఉంది?

జిల్లాలో 3 క్లస్టర్లు నడుస్తున్నాయి. వీటిలో ఉప్పాడ కాకుండా కొత్తగా ప్రత్తిపాడు, గొల్లప్రోలు క్లస్టర్లను ఏర్పాటు చేశాం. సుమారు 900 మంది లబ్ధిదారులను గుర్తించాం. వీరికి వివిధ పరికరాలను, చేనేత పనిముట్లను అందజేస్తాం.

మార్కెటింగ్ ఇన్సెంటివ్ పథకం ప్రయోజనాలు ఏమిటి.?

ఈ పథకం ద్వారా చేనేత వస్త్రముల అమ్మకాలపై 20 శాతం రాయితీ ఇచ్చి అమ్మకం పెరిగేటట్లు చూసి దీనిద్వారా సభ్యులకు నిరంతరం పని కల్పించడమే పథక ముఖ్య ఉద్దేశం.ఈ పథకం ద్వారా చేనేత సహకార సంఘాలలో చేసిన వస్త్రాల అమ్మకాలపై రాయితీని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరిస్తుంది.

నూలు సబ్సిడీ పథకం ఎలా అమలవుతుంది

రాష్ట్ర ప్రభుత్వము ఈ పథకము ద్వారా 20 శాతం సబ్సిడీని నాణ్యమైన చీలప నూలు, రంగులు, రసాయనాలు ఆప్కో ద్వారా చేనేత సహకార సంఘాలకు సరఫరా చేస్తుంది.



గోతులమయంగా ప్రధాన రహదారులు

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వైనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియో జకవర్గం లోని పలు మెయిన్ రోడ్లు రహదారులు అధ్వానంగా తయారై ప్రయాణికులకు ప్రజలకు అసౌకర్యంగా ఉంటున్నాయి. మెయిన్ రోడ్లు పూర్తిగా పాడవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికులకు ప్రాణ సంకటం గా మారిన ఈ రోడ్లు గత ఐదేళ్లుగా ఎన్ని మొరలు పెట్టిన పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామ-రామచంద్రపురం మెయిన్ రోడ్డు ద్రాక్షారామ-యానాం మెయిన్ రోడ్డు పూర్తిగా పాడై గోతులు పడ్డాయి. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా రాళ్లు లేచిపోయి ఉన్నాయి. అదేవిధంగా ద్రాక్షారామ నుంచి యానాం వెళ్లే మెయిన్ రోడ్డు పొడవునా గోతులు ఏర్పడి పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి సుమారు 20 కి.మీ పొడవు ఉండే రోడ్డు ఐదేళ్లుగా మొత్తం పాడయింది. ఇటీవల రోడ్డు నిర్మాణం పేరుతో మరమ్మతులు చేపట్టినా పనులు పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. అసలు ఈ రోడ్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని ప్రయాణికులు పరిసర గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ద్రాక్షారామా, రామచంద్రపురం, తాళ్ల పొలం, జగన్నాయకుల పాలెం, వేలం పాలెం, వేగాయమ్మపేట, ఎర్ర పోతవరం, బాలాంతరం, కుయ్యేరు, ఉప్పు మిల్లి, కోలంక, కాపులపాలెం వరకు గల అన్ని గ్రామాలకు ఈ మెయిన్ రోడ్డు ప్రధానాధారం. వీటితోపాటు శివల మెయిన్ రోడ్డు. దంగేరు మెయిన్ రోడ్డు పూర్తిగా పాడై ఉన్నాయి. ఈ రోడ్డును వెంటనే ఆధునికీకరించాలని సంబంధిత గ్రామాల ప్రజలు ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

పనులు ఆలస్యం కావొచ్చు

రామచంద్రపురం-ద్రాక్షారామ-యానాం వెళ్లే మెయిన్ రోడ్డు ఆధునికీకరణ పనులు నిలిచిపోయాయని రోడ్డు పూర్తిగా పాడే గోతుల్లో కంకర లేచిపోయిందని రహదారి భవనాల శాఖ డిఇ వెంకటేశ్వరరావుని వివరణ కోరగా ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే మండపేట వద్ద రోడ్డు పనులు జరుగుతున్నాయని అదే కాంట్రాక్టర్ ఈ రోడ్డు నిర్మించవలసి ఉందని మండపేటలో రోడ్డు పనులు పూర్తయితే కానీ ఈ రోడ్డు పనులు ప్రారంభించరన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పనులు మరింత ఆలస్యం కావచ్చు అని వివరించారు.



ద్రాక్షారామ-రామచంద్రపురం మెయిన్‌రోడ్డు దుస్థితి



ఛిద్రమైన ద్రాక్షారామ-యానాం రోడ్డు



వేగాయమ్మ వద్ద గోతుల పడిన రహదారి

ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



ద్రాక్షారామ-యానాం రోడ్డు, రామ చంద్ర పురం- ద్రాక్షారామ రోడ్డు గత ఐదేళ్లుగా పాడై ఉండడంతో నిత్యం ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసిన రోడ్డు ఆధునికరించడం లేదు. దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, రాజకీయ నాయకులు వెంటనే స్పందించి ఈ రోడ్డును ఆధునికీకరించాలని కోరుతున్నాం.

-ఎం.నాగేశ్వరావు,మాజీ ఎంపిటిసి సభ్యుడు

రోడ్డును వెంటనే ఆధునికీకరించాలి



ద్రాక్షారామ-యానాం రహదారిలో ప్రయాణికులు నిత్యం ఇక్కట్లు గురవుతున్నారు. ఈ రహదారిపై రాళ్లు పైకి లేచిపోయి బూడిద రావడంతో ఎదుటిగా వెళ్లే వాహనాలు కనిపించడం లేదు. ప్రతిరోజు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తుంది, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అధికారులు స్పందించి ఈ రోడ్డును ఆధునికరించాలని కోరుతున్నారు.

-కాటే శ్రీనివాస్, ప్రయాణికులు

పంట కాలువను ఆధునికీకరించాలని వినతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

మండలంలోని వెల్ల గ్రామంలో పంట కాలువ పూర్తిగా పూడుకుపోయిందని దీనిని ఆధునీకరించాలని గ్రామ రైతులు, ఎంపిటిసి సభ్యులు కోరుతున్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పంట కాలవలో గ్రామస్తులు చెత్తా చెదారం, వ్యర్థాలను వేయడంతో పాటు. అరుంధతీ పేటలోని మురుగు నీరు పంట బోదె లోనికి వచ్చేలా కాలువ నిర్మించారు. ఇదే అదునుగా నూతన గహాలు నిర్మించుకున్నవారు పంట బోదెలోనికి మురుగు నీరు వదులుతున్నారు. దీనితో పంట బోదె మొత్తం, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా మిగిలిపోయిన ఆహార పదార్థాలు, చెత్తతో నిండి పోయి పూర్తి దుర్వాసన వెదజల్లుతోంది. బోదె మురికి నీరుతో నిండి పోయింది. జలగలు, తెల్లటి పురుగులు, క్రిమి కీటకాలతో నిండి పోయి నీరు ప్రవహించక రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. మురుగు నీటిలో దిగి బాగు చేయడానికి రైతులు. కూలీలు ఎవరుసాహసించకపోవడంతో ఆ బోదె కు సంబంధించి 70 ఎకరాల పంటభూమి నీటి ఎద్దడని ఎదుర్కొంటోంది. పురుగులు చేలల్లోకి కూడా ప్రవేశించి న కారణంగా ఆ 70 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవసాయ పనులకు కు ఎవరూ రావడం లేదు. పంచాయతీ వారికి ఎండిఒ ఆఫీసులో దీని గురించి ఫిర్యాదు చేసిన ఫలితం లేదని రైతులు చెబుతున్నారు. కలెక్టర్ ఇక్కడకు వచ్చినప్పుడు ఈ సమస్య గురించి తెలియజేశామని, ఎంపిటిసి సభ్యుడు చిక్కాల స్వామి తెలిపారు. ఈసమస్యనుపరిష్కరించాలని సంబంధిత అధికారులు వెంటనే ఈ సమస్య పై స్పందించాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు. లేకుంటే పంటవిరామం ప్రకటించడం తప్ప వేరే గత్యంతరం లేదని పలువురు రైతులు వాపోయారు.



చెత్తతో నిండిన పంట కాలువ

కంకరకు రూ.80 వేల చెల్లింపుపై సభ్యుల ఆగ్రహం

తోటపేట పంచాయతీలో మూడు నెలలుగా ఖర్చులు చెప్పని అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్ర పురం మండలం లోని తోటపేటలో డంపింగ్ యార్డ్ కు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రోడ్డుకు మూడు లారీలు కంకర వేసి రూ.80వేలు బిల్లు చెల్లించడంపై వార్డు సభ్యుల ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సమావేశంలో మూడు నెలలుగా ఖర్చులు చెప్పమని గ్రామ కార్యదర్శి నిలదీయగా ఈ నెల 30 వరకు గడువు కావాలని కార్యదర్శి భాస్కర్ లక్ష్మి వార్డు సభ్యులకు వివరించారు. గ్రామపంచాయతీ సమావేశంలో వార్డు సభ్యులు కాటే శ్రీను. ఇల్ల సూరిబాబు. కోట శ్రీనివాసరావు. మేర్నిడి శ్రీనివా స్‌లు పలు ప్రశ్నలు లేవనెత్తారు డంపింగ్ యార్డ్ కి వెళ్లేందుకు వేసిన కంకర కనిపించడం లేదని రోడ్డు అధ్వానంగానే ఉందని రూ.80వేలు బిల్లు చెల్లించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటుగా ఇక్కడ నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రం ఎప్పటి వరకు పని చేయడం లేదని నిరుపయోగంగా ఉందని పంచాయతీలో చేస్తున్న ఖర్చులు వార్డు సభ్యులు కూడా చెప్పకపోవడం పై వారు విమర్శించారు. తాము గెలుపొందిన నాటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీ ఖర్చులు ఆదాయం వివరాలు చెప్పకుండా గోప్యంగాఉంచడంపై వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వీటన్నిటికీ వెంటనే పంచాయతీ అధికారులు సరైన సమాధానం చెప్పాలని వారు కోరుతున్నారు.



రూ.80వేల తో కంకర వేయించిన రోడ్డు ఇదే..

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి -కాట్రేనికోన

వైసిపి పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప చేసిందేమీ లేదని, అభివృద్ధి శూన్యమని మాజీ ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు విమర్శించారు. ఆదివారం చెయ్యేరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల టిడిపి అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జగన్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అక్రమాలను వివరిస్తూ ప్రచారం చేశారు. మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద, రాష్ట్ర టిడిపి కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి నాయకులు చెల్లి అశోక్, చెల్లి సురేష్, సుధా బాబురావు, మంతెన శ్రీనివాసరాజు, త్సవటపల్లి నాగేంద్ర, నామా వెర్రిబాబు, త్సవటపల్లి శ్రీను, నంద్యాల వెంకటేశ్వరరావు, కముజు లక్ష్మీ రమణారావు, విత్తనాల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైరవిహారం..

ప్రజాశక్తి -రామచంద్రపురం

రామచంద్రపురం నుంచి వెల్ల గ్రామం వెళ్లే మెయిన్ రోడ్డు దుర్భరంగా ఉంది. ఈ రోడ్డు పొడవునా రోజురోజుకూ చెత్తాచెదారం పెరిగిపోతోంది మండలంలోని పలు గ్రామాల నుంచి చెత్తాచెదారం తీసుకువచ్చి ఈ రోడ్డు వెంబడి వేయడంతో ఇక్కడ రోజురోజుకు చెత్త కొండలా పెరుగుతుంది. రోడ్డు వెంబడి రోజురోజుకు పెరిగిపోతున్న చెత్తతో దుర్వాసన వెదజల్లి అటు వెళ్లే ప్రయాణికులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు వెంబడి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఒకవైపు చెత్తాచెదారం మరోవైపు పందల సంచారంతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణికులు పరిసర గ్రామస్తులు ఇక్కట్లకు గురికావాల్సి వస్తోంది. దీనిపై ఇటీవల మండల పరిషత్ సమావేశంలోనూ సభ్యులు అధికారులు దష్టికి తీసుకువచ్చారు. జెసిబిలతో చెత్త తొలగించాలని సూచించారు అయితే ఇది అమలకు నోచుకోలేదు వెంటనే రోడ్డు వెంబడి ఉన్న చెట్లను తొలగించాలని, పందుల సంచారాన్ని అరికట్టాలని వెల్ల గ్రామస్తులు పరిసర ప్రాంతాల ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.



వెల్ల గ్రామం వెళ్లే రోడ్డులో చెత్త, సంచరిస్తున్న పందులు

నేరాలు ఘోరాలు

పరిస్థితి విషమించి యువకుని మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పురుగుమందు తాగి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కందుకూరి చిట్టిబాబు(22) పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. బిక్కవోలుకు చెందిన చిట్టిబాబు కుటుంబం కొంతకాలంగా బంధువుల ఊరైన పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంలో నివాసముంటున్నారు. ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు చిట్టిబాబును మందలించారు. కోపంతో చిట్టిబాబు ఈనెల 18న పురుగుల మందు తాగాడు. ప్రాథమిక చికిత్స అనంతరం అతన్ని కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

కల్లు పాక దగ్ధం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు మెరకవీధి సమీపంలో ఆదివారం బల్ల వెంకన్నకు చెందిన కల్లుపాక దగ్ధమైంది. ధూమపానం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి కె.రాముడు తెలిపారు. కల్లుపాకతో పాటు, మోటార్ సైకిల్ కాలిపోయింది. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. అగ్ని మాపక శాఖ సిబ్బంది మంటలను ఆర్పేశారని తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తిరుమాలి శివారు ఏలేరు కాలువ గట్టుపై పేకాట ఆడుతున్న ఐదుగురిని ఏలేశ్వరం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఏలేశ్వరం ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ మాట్లాడుతూ పేకాట, గుండాట, కోడిపందేలు, కోతబంతి వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.2,100 నగదును స్వాధీనం చేసుకున్నామ న్నారు. నిందితులను సోమ వారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

కానిస్టేబుల్ చేతికి గాయం

ప్రజాశక్తి - కొత్తపేట

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని రక్షించిన కానిస్టేబుల్‌కు చేతికి గాయమైంది. స్థానిక గౌతమి నగర్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 112కు కాల్ రాగా పోలీస్ స్టేషన్ లో అందుబాటులో ఉన్న పిసి ఎస్‌టిఎల్.ప్రసాద్, మరో పిసి ఘటనా ప్రదేశానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ కముజు సత్తిబాబు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని గ్యాస్ సిలిండర్ లీక్ చేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే కానిస్టేబుల్ ప్రసాద్ తలుపులు పగలగొట్టి సత్తిబాబును కాపాడుతుండగా ప్రమాదవశాత్తు అతని చేతిలో ఉన్న చాకు కానిస్టేబుల్ కుడి చేతికి తగిలి గాయమైంది. ప్రసాద్ చికిత్సకోసం ఏరియా ఆస్పత్రికి వెళ్లారు.